# అప్పులు - ఆర్థిక ఇబ్బందుల నుండి విడుదల కొరకు చేసుకొనవలసిన - ప్రార్థన - 06

ప్రేమమయుడైన పరలోకపుతండ్రీ!
నీకు స్తుతులు, స్తోత్రములు, వందనములు.

ప్రభువైన దేవా! కీర్తనలు 24:1లో
"భూమియు దాని సంపూర్ణతయు,
లోకమును దాని నివాసులును యెహోవాయే"
అని బైబిల్ సెలవిచ్చియుండగ
నేను నీ సంపూర్ణతలో నుండి పరిపూర్ణమైన ఆశీర్వాదములను,
ఆర్థిక దీవెనలను, సంపదను పొందుకోలేక ఆర్థిక సమస్యలతోను,
తీర్చలేని అప్పుల ఊబిలోను మునిగియున్నాను.
ప్రభువా! నన్ను కరుణించండి.
ప్రభువా! ఈ దీనుని యెడల కృప చూపించి కనికరించండి.
లూకా 11:9లో వ్రాయబడిన "అడుగుడి మీకియ్యబడును"
అనే వాగ్దానమును పట్టుకొని
నీ పాదముల చెంత చేరియున్నాను.
నా ఆర్థిక ఇబ్బందుల నుండి
నాకు విడుదల ప్రసాదించండి.

"మీరు మన ప్రభువైన యేసుక్రీస్తు కృపను ఎరుగుదురు గదా?
ఆయన ధనవంతుడై యుండియు
మీరు తన దారిద్రము వలన
ధనవంతులు కావాలెనని,
మీ నిమిత్తము దరిద్రుడాయెను."
అని 2 కొరింథీ 8 : 9 లో వ్రాయబడిన వాక్యమును బట్టి
నీకు స్తుతులు స్తోత్రములు.
యేసయ్య! నీవు నా కొరకు దారిద్ర్యమును అనుభవించినను
నేను ధనవంతుడను కాలేక యింకను దారిద్ర్యములో విలవిలలాడి
పోవుచున్నాను. నా అప్పులకును, నా పేదరికమునకును,
నేను పడుతున్న యిబ్బందులకు, నా శ్రమలకును
నా అవిధేయతనే కారణమని నేను ఒప్పుకొనుచున్నాను.

నీ మీద నేను సణిగిన సణుగులను బట్టి
క్షమాపణ కోరుకొనుచున్నాను.
అనాలోచితముగా వ్యర్థమైన పనుల కొరకు,
నేను చేసిన అప్పులను బట్టి నన్ను క్షమించండి.
నా తప్పులను సరిదిద్దుకొని
కొత్త జీవితం కొనసాగించడానికి
అవకాశమును దయచేయండి.
ప్రభువైన దేవా యేసయ్యా,
నీ ఆజ్ఞలను, నీ నియమములను
నేను సరియైన రీతిలో పాటించలేదు.
నా రాబడిలో నీకు ఇవ్వవలసిన
ప్రథమఫలమును యివ్వలేకపోయాను.
బాధలలో దుఃఖములోవున్నవారికి
సహాయము చేయగలిగుండి కూడా
సహాయము చేయలేకపోయాను.
నాకున్న కఠినమైన మనస్సునుబట్టి
నీ పాద సన్నిధిలో క్షమాపణ కోరుకొనుచున్నాను.
నీవు నాకు సమృద్ధి యిచ్చినప్పుడు
వ్యర్థముగా విచ్చలవిడిగా డబ్బును వృథాచేసివున్నాను;
నా అజ్ఞానమును క్షమించండి.
ప్రభువైన దేవా! నీవు కనికరము, దయ,
వాత్సల్యముగల ప్రభుడవని
నేను మనసార నమ్ముచున్నాను.
నా ఆర్థిక సమస్యలకును, నా అప్పులకును
కేవలము నేనే బాధ్యుడను;
ఆడంబరముల కోసం అతిశయముతో
ఎన్నో పర్యాయములు డబ్బు వృథా చేసియున్నాను.
నా తప్పులను క్షమించి నన్ను ఆశీర్వదించండి.
మలాకి 3:10లో నా మందిరములో ఆహారముండునట్లు
పదియవ భాగమంతయు
మీరు నా మందిరపు నిధిలోనికి తీసుకునిరండి;
దీనిచేసి మీరు నన్ను శోధించినయెడల
నేను ఆకాశపువాకిండ్లను విప్పి,
పట్ట జాలనంత విస్తారముగా
దీవెనలను కుమ్మరించెదను,"

అని సెలవిచ్చిన తండ్రివైన యెహోవా దేవా!
యికనుంచి నా కష్టార్జితమంతటిలో నుండి
మీ ఆజ్ఞ ప్రకారము ఇవ్వవలసిన
దశమభాగమును క్రమము తప్పకుండ
నీ పరిశుద్ధ మందిరముకును,
జీవము కలిగిన నీ సంఘమునకును
సణుగకయు బలవంతముగా కాకయు
ఉత్సాహముతో తీసుకుని వచ్చి అర్పించెదనని
తీర్మానము చేసుకొనిచున్నాను.
నేను చేసిన ఈ తీర్మాణ విషయములో తప్పిపోకుండా
స్థిరముగా వుండునట్లు నన్ను బలపరచండి.

2 కొరింథీ 9:7లో

"దేవుడు ఉత్సాహముగా యిచ్చువానిని ప్రేమించును"
అని వ్రాయబడి వుండగా
నేను ఉత్సాహముగా ధారాలగా నీ పరిశుద్ధ సేవకొరకు
యిచ్చుటకు సహాయము చేయండి.

సామెతలు 8:21లో

నన్ను ప్రేమించు వారిని
ఆస్తికర్తలుగా చేయుదును
వారి నిధులను నింపుదును" అని సెలవిచ్చిన దేవా!
నేను నిన్ను ప్రేమించడానికి సహాయము చేయండి.
నా పైనను నా కుటుంబము పైనను
దీవెనల వర్షమును కుమ్మరించి సంతృప్తి జీవితమును,
సమృద్ధిని నాకు అనుగ్రహించండి.

దయగల దేవా!
నా అప్పుల బాధలన్నింటి నుండియు,
నా ఆర్థిక సమస్యలన్నింటి నుండియు
ఇల్లు/ పొలము/ బంగారు తాకట్లనన్నింటి నుండియు
విడుదల దయచేసి క్రొత్త జీవితము ప్రసాదించండి.
నా జీవితంలో మరెన్నడు అజ్ఞానముతో అప్పులు చేయకుండా
విశ్వాసముతో నీ మీద ఆధారపడి
జీవించడానికి కావలసిన బుద్ధి
వివేకమును దయచేయండి.

ప్రభువా! నేను చాలా క్లిష్టపరిస్థితులలో జీవించుచున్నాను.
ఒక్కసారి నా దీనస్థితిని గమనించి నన్ను పైకి లేవనెత్తండి.
నీవు నాకు సహాయము చేయనిచో
ఈ అప్పుల ఊబి నుండి నేను పైకిరాలేను.

దేవా! నన్ను విడిపించుటకు త్వరగా రమ్ము
యెహోవా! నా సహాయమునకు త్వరగా రమ్ము
నేను శ్రమలపాలై దీనుడనైతిని
దేవా! నన్ను రక్షించుటకు త్వరపడి రమ్ము
నాకు సహాయము నీవే నా రక్షణకర్తవు నీవే
యెహోవా! ఆలస్యము చేయకుము.

ఓ నా దేవా! నీవు నా ప్రార్థన ఆలకించియున్నావని
నిశ్చయముగా నీ కృపా బాహుళ్యముతో
నా కన్నీటిని తుడిచి,
అన్యజనులలో నన్ను సిగ్గుపడనియ్యవని నమ్ముచున్నాను.
ప్రభువైన దేవా! నా కష్టార్జితము చుట్టూను,
నా కుటుంబము చుట్టూను నీ కంచె వేయండి.
నా చేతి పనులను, నా కష్టార్జితమును ఆశీర్వదించండి.
నా సమస్త సమస్యలన్నింటి నుండి
త్వరలోనే మీరు నాకు విడుదల దయచేయబోతున్నారని
మనస్ఫూర్తిగా నమ్ముచు
నీకు కృతజ్ఞతాస్తుతులు, స్తోత్రములు,
వందనములు, నమస్కారములు
తెలియజేయుచున్నాను.

నీ ప్రియకుమారుడును, మా రక్షకుడైన
యేసు నామములోనే
కృతజ్ఞతాస్తుతులు స్తోత్రములు చెల్లించి
వేడుకొనుచున్నాము తండ్రీ. ఆమేన్...

సమకూర్పు:
దైవజనులు డా.. ఇమ్మానుయేలు సన్నిధి, ఎల్లుద్దాయి.